క్లుప్తంగా

హోం మంత్రి అనితకు మాస్టర్ మైండ్స్ అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను మాస్టర్ మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ శుక్రవారం విజయవాడలోని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. త్వరలో గుంటూరులోని మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో జరుగనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా కోరారు.

'బయాలజీ'కి ఎన్ఏబీఎల్ గుర్తింపుపై హర్షం



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రో బయాలజీ విభాగానికి ఎన్ఏబీఎల్ గుర్తింపు మరోసారి రావడంపై గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆసుపత్రిలో మైక్రో బయాలజీ వైద్యులను ఆయన అభినందించారు. ఎన్నో సంవత్సరాల విశేష కృషి వల్ల ఎన్ఏబీఎల్ మరోసారి మైక్రోబయాలజీకి వచ్చిందని, ఇది అందరి సమష్టి కృషితో సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, డాక్టర్ ఇజ్రాయేల్, పవన్ కుమార్, నాగేశ్వరావు, ముస్తఫా పాల్గొన్నారు.

సరళ రూనీస్ రాణికి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకురాలు జె.సరళ రూనీస్‌రాణికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్మయి శుక్రవారం తెలిపారు. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధన పరిశీలకురాలు డాక్టర్ టి.రమాదేవి పర్యవేక్షణలో 'ఎ స్టడీ ఆన్ ప్రాబ్లమ్స్ ఇన్ మార్కెటింగ్ ఆఫ్ కాటన్ అండ్ ది రోల్ ఆఫ్ డిఫరెంట్ మార్కెటింగ్ ఏజెన్సీస్ – ఎస్పెషల్ రిఫరెంట్ టు వరంగల్, అదిలాబాద్ అండ్ మహబూబ్ నగర్ డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగింది.

పీజీఈ సెట్ ఫలితాల్లో 'హిందూ ఫార్మసీ' విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన పీజీఈ సెట్–2024 ఫలితాల్లో అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి, మెరుగైన ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ.ఫార్మసీ చివరి సంవత్సరం చదువుతూ పీజీఈ సెట్‌కు హాజరైన 52 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. వారిలో 13 మంది వెయ్యి లోపు ర్యాంకులు సాధించారని వివరించారు. గౌహతిలోని నైపర్ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తమ కళాశాల విద్యార్థిని టి.ఉమామహేశ్వరి అర్హత సాధించిందని, సంబంధిత విద్యార్థులందరికీ వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎం ఫార్మసీలో ప్రవేశంతో పాటు ఉపకార వేతనం పొందేందుకు అర్హత లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. ప్రత్యూష, ఓఎస్డీ పి.సీతారామయ్య, పీజీఈ సెట్ కోచింగ్ ఇన్‌చార్జ్ సీహెచ్ ప్రసాదరావు విద్యార్థులను అభినందించారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా రాంబిల్లి మండలం వడపాలెం గ్రామానికి చెందిన సూరాడ దేవుడు (56) తన కుటుంబసభ్యులు, బంధువులతో కలసి తిరుపతి వెళ్లేందుకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో గురువారం బయలుదేరాడు. తెనాలి రైల్వేస్టేషన్ మూడో నంబరు ప్లాట్ ఫాం వద్దకు రాగా ప్రమాదవశాత్తు రైలుకు, పట్టాల మధ్యలో పడి మృతి చెందాడు. ఇది గమనించని కుటుంబ సభ్యులు అదే రైలులో తిరుపతి వెళ్లిపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు సేకరించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల్లో అమోఘమైన మేధా సంపత్తి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: దివ్యాంగుల్లో అమోఘమైన మేధా సంపత్తి దాగి ఉంటుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ దివ్యాంగుల్లో జీవితంలో ఏదైనా సాధించాలనే తపన గాఢంగా ఉంటుందని, వారి ఆలోచనలకు పదును పెట్టి ఎన్నో అద్భుతాలు సాధిస్తున్నారన్నారు. వారిలో ఉన్న పట్టుదల, శ్రద్ధ, అంకిత భావం ఎంతో గొప్పవన్నారు. మరొక అతిథి ఏపీ



ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు జ్ఞాపిక బహూకరిస్తున్న పరమహంస, యజ్ఞదత్

హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ ఇన్‌చార్జ్ జూపూడి యజ్ఞదత్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఆశయంతో సమర్థనం సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యా వంతులైన దివ్యాంగ నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. సమర్థనం సంస్థ ప్రతినిధి ఎంఆర్కే పరమహంస మాట్లాడుతూ 35 బహుళ జాతి సంస్థలు పాల్గొన్న ఈ జాబ్ మేళాకు హాజరైన 600 మంది నిరుద్యోగ యువతలో 150 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపల్ ఎంపీ నాగభూషణం, ఫార్మా డీ డైరక్టర్ పి.సీతారామయ్య, సమర్థనం దివ్యాంగుల సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యా బోధనకు కృషి

తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక సదుపాయాలతో కూడిన విద్యా బోధనకు కృషి చేస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. సంగడి గుంటలోని బాపూజీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కమిటీ సమావేశపు మందిర ప్రారంభోత్సవంతో పాటు గుంటూరు చలమయ్య–సాధు సుబ్రహ్మణ్యం హై స్కూల్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడంతో పాటు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పుస్తకాలు, ఆరోగ్యకరమైన భోజనం అందిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వ ఆధ్వర్యంలో త్వరలోనే ట్రిబుల్ ఎస్ స్కీం కింద స్టడీ, స్పోర్ట్స్, స్కిల్ డెవలప్‌మెంట్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తామని తెలిపారు. బాపూజీ కమిటీ ఆధ్వర్యంలో గత 60 ఏళ్లుగా వేలాది మంది విద్యార్థులకు విద్యను అందించడం అభినందనీయమన్నారు. గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 40 మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు పొం



స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

దడం హర్షించదగిన పరిణామమన్నారు. ఈ సందర్భంగా బాపూజీ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రెండువేల నోటు పుస్తకాలను కర్పూరపు వెంకట నారాయణ–పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, కళాశాల అధ్యక్షుడు సాధు శివశంకర్ రావు, బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు, ఉపాధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు, కోశాధికారి మాజేటి ప్రసాద్, కర్పూరపు వరుణ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు, గుంటూరు సత్యనారాయణ, టీడీపీ నాయకులు కొనగళ్ల సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

లక్ష్మీపురం: స్థానిక హజ్రత్ మొహీయుద్దీన్ పాలెంలో వేంచేసి ఉన్న హజ్రత్ సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్‌షా ఖాదిరి దర్గాలో శుక్రవారం చంద్రమాన 21వ రోజు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి నెలా చంద్రమాన 21వ రోజు హజ్రత్ మహబూబ్ సుభాని 17వ మనువలు సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్‌షా ఖాదిరి బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు భక్తుల సమక్షంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని దర్గా పీఠాధిపతి, బాబా 23వ మనువలు పీర్ సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి అల్ జిలానీ తెలిపారు. బాబా సమాధిని పూలతో అలంకరించి ధూప దీపాలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగర నడిబోడ్డున ఎంతో మహిమ కలిగిన హజ్రత్ మహబూబ్ సుభాని (గౌసుల్ ఆజం దస్తగిర్) మనువలు



ప్రత్యేక ప్రార్థనలో పీఠాధిపతి, భక్తులు

దర్గా ఉండటం జిల్లా వాసులు చేసుకున్న అదృష్టమన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, పీర్ మురీదులు, స్థానిక మొహీయుద్దీన్ పాలెం వాసులు తదితరులు పాల్గొన్నారు.

మూడు దేవస్థానాల్లోని హుండీల రాబడి రూ.9.32 లక్షలు

నగరంపాలెం: గుంటూరు కొత్త పేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం, శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం, లాలా పేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీల కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవస్థానాల సహాయ కమిషనర్ (ఈవో) డి.శ్రీనివాసరావు, పర్యవేక్షణాధికారి టి.శ్రీనివాస్, దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గా వరప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు భూమా వీర వెంకట భాపారావు, శ్రీ సద్గురు సేవా సమితి ఇన్‌చార్జి, సభ్యుల సహకారంతో లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానం హుండీలో రూ.9,719, ఆంజనేయ స్వామి దేవస్థానం హుండీలో రూ.4,98,977, వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలో రూ.4,24,254 నగదు వచ్చిందని ఏసీ తెలిపారు. మూడు నెలలకు కలిపి మూడు దేవస్థానాలకు రూ.9,32,950 ఆదాయం వచ్చిందన్నారు. ఈ లెక్కింపు ప్రక్రియలో ధర్మకర్తల మండలి సభ్యులు ఉడతా మహేష్



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కుమార్, దమ్మలపాటి విజయ నిర్మల, ఇస్లావత్ గాంధీనాయక్, యంబాడి రాంబాబు, సురిబోయిన వెంకట్రావు, వైలవరపు సుజన, తరిమెళ్ల వనజ, జవ్వాజీ లక్ష్మీ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే విజయం మీ సొంతం

కాకుమాను: ప్రతి విద్యార్థి కష్టపడడంతో పాటు ఇష్టపడి చదివితే విద్యలో రాణిస్తారని జిల్లా విద్యాశాఖాధికారిణి పి.శైలజ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళిక మేరకు చదువు కొనసాగించాలని కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలతో పాటు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం మూడు గంటల పాటు ఇంటి వద్ద పాఠ్యపుస్తకాలను చదవాలని సూచించారు. ఇలా ప్రతి రోజు చేయడం వలన పది పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించవచ్చునని వివరించారు. మీకు కష్టమైన సబ్జెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి రోజు ఆ సబ్జెక్టును ఇంటి వద్ద చదువుకోవాలన్నారు. ఈసందర్భంగా ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారా, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం అమలు తీరు ,తాగునీరు వంటి అంశాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ శైలజ

తల్లిదండ్రులకు అవగాహన..

అనంతరం స్థానిక బీసీ కాలనీలో డీఈఓ పర్యటించారు. నేను బడికి పోతా కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడి ఈడు పిల్లలందరూ తప్పని సరిగా బడిలోనే ఉండాలని, బడి ఈడు పిల్లలతో వెట్టిచాకిరి చేయించడం నేరమని హెచ్చరించారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత యూనిఫాం , మధ్యాహ్న భోజన పథకం, ఏటా ప్రతి విద్యార్థికి నగదు అందిస్తుందని వివరించారు. బడి ఈడు పిల్లలందర్నీ బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు కేఎఫ్ కెనడీ, కె.విజయ్ భాస్కర్, హెచ్ఎం బి.సత్యం పాల్గొన్నారు.

శుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ శరీర శుభ్రత పాటించడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టీఎంకే సుబ్బారాయణం అన్నారు. మండలంలోని నుదురుపాడు గ్రామంలో రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఫ్రైడే–డ్రైడేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. రైల్వేస్టేషన్ పరిధిలోని పరిసరాలు, నీటి తొట్లు, సమీపంలో ఉన్న నీటి కుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ఆరోగ్య సిబ్బంది ఎంతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆరోగ్య సంబంధిత విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తమ ఇంటి చుట్టు పక్కల ప్రదేశాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నీటి కుంటలు, తొట్లలో నీటిని ఎక్కువ రోజులు నిలువ ఉంచకూడదని



పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బారాయణం

చెప్పారు. దాని వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి జ్వరాలు వస్తాయని తెలిపారు. ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది తమ దృష్టికి వచ్చిన అంశాలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లయితే వాటికి సంబంధించిన పంచాయతీ సిబ్బంది వాటిని పరిష్కరిస్తారని చెప్పారు. ఆయన వెంట జిల్లా సహాయ మలేరియా అధికారి డి.రాజునాయక్, ఎస్‌యూవో చంద్రశేఖర్, నుదురుపాడు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో 59,403 మందికి పింఛన్లు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 59,403 మంది పింఛనుదారులకు జూలై 1న ఉదయం 6 గంటల నుంచి ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 206 వార్డు సచివాలయాల పరిధిలో 1,632 మంది సచివాలయ కార్యదర్శుల ద్వారా రూ.40,87,60,000లు సజావుగా పంపిణీ చేసేందుకు.. ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని తెలిపారు. పర్యవేక్షణకు 42 మంది నోడల్ అధికారులను నియమించామని పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ విధులు కేటాయించబడిన కార్యదర్శులు తమకు కేటాయించిన ప్రాంతం, పెన్షనర్ల సంఖ్య(కేటగిరి వారిగా), పంపిణీ చేయాల్సిన నగదు తదితర అంశాలను నోడల్ అధికారి ద్వారా తెలుసుకోవాలని తెలిపారు. ప్రతి గంటకు పంపిణీ శాతం నగరపాలక సంస్థకు తెలియచేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హేన దీప్తికి అభినందనలు

నెహ్రూనగర్: అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీ రైజింగ్ స్టార్‌గా గుంటూరు నగరానికి చెందిన కొండా హేన దీప్తి అర్హత సాధించడం అభినందనీయమని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి లాడ్జి సెంటర్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెనడాలో పనిచేస్తున్న హేన దీప్తి అమెజాన్ కంపెనీలో 6వ లెవల్‌లో పనిచేస్తూనే యాపిల్, గూగుల్, ఆర్‌టీఎక్స్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్స్‌లో టెక్నాలజీ రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తూ కెమికల్ పౌడర్ లోడుతో వస్తున్న లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కడప నుంచి కెమికల్ పౌడర్ లోడుతో రాజమండ్రికి వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తూ ఫిరంగిపురంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో లారీ ముందు భాగం బాగా దెబ్బతింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. కాగా ఆ ప్రాంతంలో చీకటిగా ఉండి డివైడర్ కన్పించకపోవడంతో ప్రమాదం సంభవించిందని లారీ డ్రైవర్ మున్నా తెలిపాడు.

రిజర్వేషన్లపై కోర్టు తీర్పును వ్యతిరేకిద్దాం

తెనాలి: బిహార్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సామాజిక రిజర్వేషన్లు 50 శాతానికి మించటం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమంటూ, పాట్నా హైకోర్టు రద్దు చేయడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడుకేసన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ముమ్మాటికీ అది బడుగు బలహీన వర్గాలకు వ్యతిరేకమైన తీర్పుగా ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయస్థానాల తీర్పుల్లో కూడా పేదలు– బడుగుల ప ట్ల వివక్షత ఉంటుందనడానికి, పాట్నా హైకోర్టు తీర్పు ఒక నిదర్శనంగా ఉంటుందన్నారు. ఏ కమిషన్ సిఫార్సులు, ఎట్టి గణాంకాలు ప్రాతిపదికలుగా చెప్ప కుండానే, రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం, 10 శాతం కూడా లేని అగ్రకుల పేదలకంటూ తెచ్చిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు మాత్రం అనుకూల తీర్పులు ఇవ్వడం, అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సివస్తే మాత్రం, అడ్డు పుల్లలు వేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు మొత్తం రిజర్వేషన్లు 60 శాతం సీలింగ్ దాటినప్పుడు లేని అభ్యంతరం, బిహార్లో శాస్త్రీయంగా జనగణనలో సమగ్ర కులగణన నిర్వహించి, ఆ కులగణనల ఆధారంగా పెరిగిన జనా భా మేరకు, రిజర్వేషన్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం పెంచితే మాత్రం పెంపు చెల్లదంటూ, పాట్నా హైకోర్టు తీర్పునివ్వడం అన్యాయం– అధర్మమంటూ శంకర రావు వాపోయారు. రిజర్వేషన్లు దక్కడం న్యాయవ్యవస్థకు ఇష్టం లేనట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై త్వరలో ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అట్టడు గు వర్గాలకు ముఖ్యంగా బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్ల సాధన కోసం గల్లీ నుండి ఢిల్లీ వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

కౌలు రైతు కార్డులపై అవగాహన

పెదకాకాని: భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు(సీసీఆర్‌సీ) ఇచ్చేందుకు జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ పెల్లూరి రత్నం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కౌలు రైతు గుర్తింపు కార్డులపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సంయుక్తంగా గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించి వారి జాబితా సిద్ధం చేయాలన్నారు.

గుంటూరులో నోవెల్ హోటల్ ప్రారంభం

అందరికి అందుబాటులో 5 స్టార్ హోటల్

నగరంపాలెం: మెట్రో నగరాలకు దీటుగా అధునాతనమైన టెక్నాలజీతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గుంటూరు నగరంలో 5 స్టార్ హోటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అత్యాధునిక సదుపాయాలతో గుంటూరు చంద్రమౌళి నగర్ ఒకటో వీధిలో నూతన హంగులతో కొత్తగా నిర్మించిన నోవెల్ హోటల్‌ను శుక్రవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మోదుగుల మాట్లాడుతూ గుంటూరు జిల్లా రాష్ట్ర రాజధానిగా విరాజిల్లుతున్న తరుణంలో గుంటూరు నగరం నడిబొడ్డున నోవెల్ హోటల్‌ను అందుబాటులోకి తేవడం గొప్ప విషయమన్నారు. అన్ని కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు వీలుగా అత్యంత సౌకర్యవంతంగా హోటల్ ఉందన్నారు. అత్యున్నతమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చిన హోటల్ యాజమాన్యాన్ని అభినందించారు. నోవెల్ హోటల్ మేనేజింగ్ డైరక్టర్ నూనె రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సంపాదన దృష్టితో కాకుండా వినియోగదారులకు సంతృప్తికరమైన, ఉన్నతమైన సేవలు అందించాలనేది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆరోగ్యకరమైన వాతావరణం ఉట్టిపడేలా, ఆధునాతనమైన సాంకేతిక వసతులతో హోటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో కట్టెల పొయ్యిలపై వంటకాలు వండించి, అందించడం తమ హోటల్ ప్రత్యేకత అని తెలిపారు. రూఫ్ టాప్ రెస్టారెంట్, నెల్లూరు చేపల పులుసు, హైద్రా



నోవెల్ హోటల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఎంపీ

బాద్ మటన్ బిర్యానీతో పాటు పలు రకాల నాన్ వెజ్‌లు రుచికరంగా అందిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని గుంటూరు జిల్లా, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, ఖాతాదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: న్యాయవాద వృత్తిలో రాణించాలంటే భారత రాజ్యాంగంపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళి (జేసీ) న్యాయ కళాశాల స్నాతకోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు న్యాయ పట్టభద్రులకు ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి వేమన కుప్పుస్వామి, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీ



పట్టభద్రులతో ఎమ్మెల్యే కొలికపూడి, సుధాకరబాబు

మోహన్, సభ్యులు కొర్రపాటి రామారావు, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ సుధాకరబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశానికే ఠీవీ మాజీ ప్రధాని పీవీ

లక్ష్మీపురం: విలక్షణమైన వ్యక్తిత్వం, విజ్ఞానంతో కూడిన తేజస్సు మాజీ ప్రధాని పీవీ నరసింహరావు సొంతమని కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ కొనియాడారు. స్థానిక బ్రాడీపేటలో శుక్రవారం మాజీ ప్రధాని పీవీ నరసింహరావు 103వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీ దేశానికే ఠీవీ అని వ్యాఖ్యానించారు. రాజకీయ చతురుడు, రాజీపడని అపర చాణక్యుడు పదహారణాల తెలుగు వారని కీర్తించారు. ముఖ్యమంత్రిగా, ప్రధానిగా దేశ ప్రయోజనాలు కాపాడటంలో క్రియాశీలకంగా వ్యవహరించిన రాజకీయ కోవిదుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్, నారాయణ,



పీవీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెంకటకృష్ణ

పరశురామ బ్రాహ్మణ సంఘం అధ్యక్షురాలు కప్పగంతుల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ సస్యశ్యామలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై శుక్రవారం నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ కార్యక్రమాల్లో భాగంగా తిరుప్పావై అమృత వర్షిణి డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగ నాయకి భాగవత గోష్ఠి బృందం ఈ కార్యక్రమం చేపట్టింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, బొల్లేపల్లి లలితాంబ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీ రంగనాయకి ప్రసంగిస్తూ అమ్మవారిని స్తుతించడం ద్వారా భగవాన్ శంకరాచార్యుల వారికి విముక్తి కల్పించినట్లు తెలిపారు. అమరావతి ఆర్థిక సమస్యల నుంచి విముక్తికి ఈ పారాయణ సంకల్పానికి పూనుకున్నట్లు



పారాయణం చేస్తున్న బృంద సభ్యులు

చెప్పారు. ఒక ప్రాణికి మేలు చేస్తే ఆ స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులవుతామని పేర్కొన్నారు. భాగవత గోష్ఠి బృందం కనకధారా, శ్రీలక్ష్మ్యష్టోత్తర శతనామ స్తోత్రసహిత శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రం 108 సార్లు పారాయణం చేశారు.